# తెర తీయగ రాదా

అతడి పేరు వెంగళదాసు.

డొక్కు సైకిలు తొక్కుకుంటూ.... అరుచుకుంటూ వీధి వీధి తిరుగుతున్నాడు. చెమట పట్టి శరీరం కంపుకొడ్తోంది. మాసిన బట్టలు, పెరిగిన గడ్డం చికాకును తెప్పిస్తున్నాయి. అయినా తప్పదు.

తన తాత వృత్తి అది.... తండ్రి వృత్తి అది... ఇప్పుడు తనకు.. రేపు కొడుక్కి... మరోసారి అరిచాడు.

"పాత చెప్పులకూ... ఇనుప సామాన్లకూ.... బతానీలు, పీచు మిఠాయి, బెల్లమిస్తాం... బంగారి గొలులిస్తాం... అలా పాడటం ఎన్నో సార్లోగాని నోరు బొంగురుపోయింది. గొంతు ఎండుకుపోయింది. కొందరు పిల్లలు బిలబిలమని వచ్చారు. అందరి చేతుల్లోనూ పాత చెప్పులు, పనికి రాని ఇనుప బకెట్లు, పళ్ళాలు, అవీ ఇవీ.... వాటిని తీసుకొని వెంగళదాసు బతానీలు.... కొందరికి బెల్లం పెడుతున్నాడు. వాళ్ళు తెచ్చేవి చాలామటుకు శిథిలమైనవే (అతని బతుకు లాగా).

వస్తువుని బట్టి పదార్థం పెడుతుంటే పిల్లలు గోలచేస్తున్నారు మరింత పెట్టమని!! సైకిల్ చుట్టూ గోల గోల... 'కొసరు' కొంత వాళ్ళ చేతుల్లో నొక్కేసి అరుచుకుంటూ మళ్ళీ ప్రయాణం.

సందు.... సందులూ తిరుగుతున్నాడు.

ఆడ పిల్లలు ఏవో పాత సామానిచ్చి... రోల్డ్ గోల్డ్ గొలుసు లిమ్మంటున్నారు. మరింత పెట్టమని!! ప్రక్క పిన్నీసులిమ్మంటున్నారు. పాత సవరాలకు బొట్టు బిళ్ళలిస్తావా అనడుగుతున్నారు.

రావంటే గొడవ పెడుతున్నారు. అతనేం తక్కువ తిన్లేదు. తూచి తూచి బేరం చేస్తున్న వాళ్ళని పనికిరావంటూ వాపసిస్తున్నాడు. అలా అనేసరికి చప్పున అతడిచ్చినవి తీసుకుంటున్నారు. అలా ఒక వాడలో పిల్లల్తో గొడవ పడుతూంటే.... ఓ ముస్లిం స్త్రీ దగ్గరదాకా వచ్చింది. నిండా నల్లటి బురఖా.... కేవలం కళ్ళు మాత్రమే కన్పిస్తున్నాయి.

కాటుకతో తీర్చిదిద్దిన విశాలమైన కన్నులు....

ఆ కన్నులు చూడగానే ఆ ముక్కు.... పెదవులూ చూడాలన్పిస్తుంది ఎవరికైనా. వెంగళదాసు ఆమె వంక చూశాడు. ఆమె కళ్ళలో తళుక్కు మన్న వెన్నెల కాంతుల్ని చూశాడు. ఆనందంతో ఆమె రెప్పలు టపటప లాడిచింది. వెంగళదాసుకు అర్థంకాలేదు. అసలే పీక్కుపోయిన మొహంతో ప్రశ్నార్థకంగా చూశాడు· రెండు నిమిషాలు అలాగే నిల్చుందామె!

పాత సామాన్లేమీ తేలేదు...

తళుక్కుమన్న ఆమె కళ్ళలో వెలుతురు స్థానే నీటిపొర తళతళ లాడింది. కనుగ్రుడ్డు కదలగానే.... కన్నీటి చుక్కజారి నాసిక మీదున్న నల్లటి బురఖాలోకి జారిపోయింది. వెంటనే విసవిసా వెళ్ళిపోయింది.

పిల్లలు పాత సామాన్లతో రావటంతో వెంగళదాసు తిరిగి బేరంలో పడ్డాడు.

ఉత్తి బితానీలు పెడితే బావుండదని తోడుగా బెల్లం పెట్టమంటున్నారు. బరువు సైకిల్ని ఈడ్చుకొంటూ అదే మాట పాడుతూ దాదాపుగా ఊరి బయటికి వచ్చాడు వెంగళదాసు. అప్పుడు వచ్చిందొక పాప వగరుస్తూ...

పరిగెత్తుకు రావటం వల్లనేమో శ్వాస బరువుగా తీస్తోంది.

"హే భయ్యా...యే చెప్పల్ లేలో..." అంది. వెంగళదాసు ఆ పాత చెప్పులు తీసుకున్నాడు.

వాటిని తాకగానే... తరంగంలాంటి స్పందన గుండెగదుల్ని తాకింది.... పందల వేల సంవత్సరాలు వెనక్కి పోయినట్టు... గతం రంగుల రాట్నమై తిరిగిపోయింది!

అవే చెప్పులు...

పంథొమ్మిది సంవత్సరాల కింద తాను దొంగచాటుగా ఆమెకు ఇచ్చిన చెప్పులు....

ఒక స్మృతి శకలం రాలిపడింది.... గుర్తొచ్చింది సలీమా!!!

పాపవైపు చూశాడు... అచ్చు అలాగే.

పంథొమ్మిదేళ్ళ కింద నాల్గో తరగతి చదివేటప్పుడు స్కూల్లో సలీమాతో స్నేహం. ఆమెకు తెలుగురాక... తనకు ఉర్దూరాక... కాని భాషలేవీ అడ్డు రాలేదు. ఇద్దరూ ఆడుకునేవారు. చెట్టాపుట్టా తిరిగేవారు బొమ్మల పెళ్ళి చేసేవారు.

ఓ రోజు నాన్న తెచ్చిన పాత సామాన్లలో ఎవరో ఇచ్చిన (సగం పాడైన) అందమైన చెప్పులు. అవి అప్పుడు జమీందారు బిడ్డ బెల్లం పెడితే ఇచ్చిందని చెప్పాడు తండ్రి.

వాటిని ఇంట్లోంచి దొంగిలించి సలీమాకిచ్చాడు. విషయం తెల్సి తండ్రి విపరీతంగా కొట్టినపుడు తలుపుకున్న చువ్వ తాకి మోచేతికి గాయం....

ఆ గాయం మచ్చగా మిగిలిపోయింది.

ఆ మచ్చే గనక మిగలకపోతే.... వెంగళదాసుకు ఆ సంఘటన గుర్తుండేది కాదేమో?

"మీ అమ్మ పేరేమిటి బేబీ?" అన్నాడు సౌమ్యంగా.

"క్యా" అంది పాప అర్థం కానట్లు.

నవ్వుకున్నాడు వెంగళదాసు. తనకింకా ఉద్ధూరాదు. తన దగ్గరున్న రోల్డ్ గొలుసుల్లో మంచిది తీసి పాప మెడలో వేశాడు. ముద్దులు కురిపించాడు. పాప చేతిలో తిరిగి ఆ చెప్పుల్ని ఉంచాడు.

పాప అయోమయంగా చూసి.... కళ్ళు మెరిపించి పరిగెత్తింది.

కొద్ది నిమిషాల కింద సలీమా రాల్చిన కన్నీరు గుర్తొచ్చి.... గతం పొగమంచులో పేరుకుపోతూంటే.... బరువ సైకిల్ని భారంగా తొక్కు-కుంటూ పోతున్నాడు వెంగళదాసు. ★

(ఈ ఆలోచనకు తావిచ్చిన అతడికే ఈ కథ...)

కథా నిలయం
4573
శ్రీకాకుళం

※※